ప్రభుత్వ కార్యక్రమాల్లో నాడగీత తప్పనిసరి

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ కవి కువెంపు రచించిన 'జయభారత జననియ తనుజాతె...' అనే నాడగీతను ఇకపై ప్రభుత్వ కార్యక్రమాల్లో తప్పనిసరిగా ఆలపించాలని కన్నడ సంస్కృతశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శనివారం శాఖ నుంచి ప్రత్యేక ఉత్తర్వులు విడుదలయ్యాయి. ఇప్పటి వరకూ ప్రతి రోజు విద్యాసంస్థలతో పాటు కొన్ని అధికారిక కార్యక్రమాల్లో మాత్రమే నాడగీతను ఆలపించేవారు. తాజా ఉత్తర్వుల ప్రకారం పాఠశాలలు, కళాశాలలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థలకు చెందిన కార్యక్రమాల ప్రారంభానికి ముందే నాడగీతను ఆలపించాలని ఉత్తర్వుల పేర్కొన్నారు.

హంపిలో పోటెత్తిన జనం

- ఆకట్టుకున్న కళాకారుల నృత్యాలు



తరలి వచ్చిన జనం



కూచిపూడి, భరతనాట్యం, అవతార్ వేషధారణలో ఆకట్టుకుంటున్న నృత్యాలు

హోస్పేట/కంప్లి, ఫిబ్రవరి 3 : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హంపి ఉత్సవాలను తిలకించేందుకు జనం పోటెత్తారు. రెండో రోజు శనివారం పలు చోట్ల కళాకారుల నృత్యాలు, సంగీతం కార్యక్రమాలు మైమరపించాయి. గత యేడాది కన్నా ఈసారి హంపి ఉత్సవాలను వీక్షించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివస్తున్నారు. గాయత్రి వేదికలో గాయకుల గీతాలతో పాటు నృత్యాలు కూడా కనువిందు చేశాయి. అలనాడు శ్రీకృష్ణ దేవరాయలు పరిపాలించిన సామ్రాజ్యంలో ప్రతి రోజూ పండుగలా ఈ ప్రాంతంలో జరుగుతోంది. ఈ ఉత్సవాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకులు తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తున్నారు. ఈసారి ఉత్సవాలకు తగ్గట్లు నిధులు కూడా ఎక్కువ మొత్తంలో మంజూరయ్యాయి. భరత నాట్యం, కూచిపూడి నృత్యాలు, వివిధ సంగీతాలకు మహిళలు స్టెప్పులు వేస్తూ ఆకట్టుకున్నారు. హంపిలో ఎక్కడ చూసినా సంబ్రమాలు జరుగుతుండగా.. రంగురంగుల విద్యుత్ కాంతులతో విరాజిల్లుతోంది. మంత్రులు జమీర్ అహ్మద్, నాగేంద్ర తదితరులు సాంస్కృతి కార్యక్రమాలను తిలకించారు.









రామాయణంలోని ఓ సన్నివేశం

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా దినేశ్‌కుమార్ ప్రమాణం




ప్రమాణ స్వీకారం చేస్తున్న జస్టిస్ దినేశ్‌కుమార్

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ శ్రీనివాసాచార్య దినేశ్‌కుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో శనివారం గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ దినేశ్‌కుమార్‌కు ఇటీవలే పదోన్నతి కల్పించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య, న్యాయ, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్, సీఎం కార్యదర్శులు గోవిందరాజ్, నజీర్ అహ్మద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రజనీశ్ గోయెల్, హైకోర్టు న్యాయమూర్తులు, సీనియర్ అడ్వకేట్లు పాల్గొన్నారు.



సీజేను అభినందిస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

ఆడ్వాణీకి భారతరత్నపై పలువురి హర్షం



బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ ఆడ్వాణీకి అత్యున్నత 'భారతరత్న' ప్రకటించడంపై బీజేపీ రాష్ట్ర నేతలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంతో బీజేపీకి ప్రత్యేకించి ఆడ్వాణీకి దశాబ్దాలకాలంగా సంబంధాలు ఉన్నాయి. దేశంలో బీజేపీ అభివృద్ధి చేయడంలో ఆయన పాత్ర కీలకమైనది. అయోధ్యలో రామమందిర నిర్మాణం ఆయన ఆశయమై ఉండేది. దేశవ్యాప్తంగా రథయాత్ర ద్వారా ప్రజలను సంఘటితం చేశారు. ఆడ్వాణీ రథయాత్ర రాష్ట్రంలో కొనసాగిన విధంపై నేటికీ చర్చించుకుంటారు. ఆడ్వాణీతో కలసి బీజేపీని అభివృద్ధిలో యడియూరప్ప కీలక భూమిక పోషించారు. బెంగళూరు, హుబ్బళ్లి, ధారవాడ, బెళగావి ప్రాంతాల్లో ఆయన పలు సందర్భాల్లో పర్యటించారు. అటువంటి అగ్రనేతకు భారతరత్న దక్కడంపై మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప ప్రత్యేకంగా ప్రశంసించారు. ఆయనకు భారతరత్న దక్కడం గర్వంగా ఉందని కొనియాడారు. ఈ మేరకు 'ఎక్స్' ద్వారా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ప్రజాజీవనంలో ఆయన నాయకత్వం తిరుగులేనిదని, ఎంపీగా, కేంద్రమంత్రిగా, ఉప ప్రధానిగా సేవలందించారని తెలిపారు. వ్యక్తిగతంగా, సంఘ్ పరంగా ఆయన మార్గదర్శకాలను తాను మరవలేనన్నారు. ఈ అరుదైన సంతోష సమయంలో పార్టీకార్యకర్తల తరపున ప్రత్యేక అభినందనలు అంటూ కొనియాడారు. ప్రతిపక్షనేత అశోక్ మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులకు గౌరవమైన పదవి దక్కినట్టు ఉందన్నారు. పార్టీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఒక మహాసాధకుడికి భారతరత్న లభించిందని పేర్కొన్నారు. ఇదో ఉద్వేగభరితమైన అనుభూతి అన్నారు. దేశంలోని కోట్లాదిమంది బీజేపీ అభిమానులకు పండుగ రోజన్నారు. మాజీ ప్రధాని దేవెగౌడ స్పందిస్తూ దశాబ్దాల కాలంగా రాజకీయాల్లో సమీపం నుంచి ఆయన తీరు చూశానని, క్రమశిక్షణ, నైతిక విలువలకు ఆడ్వాణీ మరో పేరు అన్నారు. అటువంటి అగ్రనేతకు భారతరత్న దక్కడం సంతోషదాయకమన్నారు. కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి హుబ్బళ్లిలో మీడియాతో మాట్లాడుతూ తాము రాజకీయాల్లోకి వచ్చేందుకు ముందు నుంచి ఆడ్వాణీని చూశామని, హుబ్బళ్లి ధారవాడతో ఆయనకు ప్రత్యేక సంబంధాలు ఉన్నాయని, ఎన్నో సందర్భాలలో ఇక్కడి సభలలో పాల్గొన్నారని, అలా తాము సన్నిహితులమయ్యామని గుర్తు చేసుకున్నారు. మాజీ సీఎం, జేడీఎస్ నేత కుమారస్వామి 'ఎక్స్' ద్వారా అభినందనలు తెలిపారు. అత్యున్నతమైన గౌరవానికి అర్హులైన వ్యక్తి ఆడ్వాణీని ఎంపిక చేశారన్నారు. దేశ రాజకీయ చరిత్రలో క్రమశిక్షణ, నిబద్ధత, స్నేహశీలత, కఠోర పరిశ్రమలకు ఆడ్వాణి మరో పేరు అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర మాట్లాడుతూ ఆడ్వాణీ లాంటి అగ్రనేత ఎప్పటికీ భారతరత్న అని, ఆయనకు తగిన గౌరవం లభించిందన్నారు. మరింతకాలం ఆయురారోగ్యాలతో దేశ సాధనలు చూడాలని ఆకాంక్షించారు.

శివకుమారస్వామికి భారతరత్న ఇవ్వండి

- ముఖ్యమంత్రి సిద్దరామయ్య



బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): లక్షలాదిమంది నిరుపేదలకు కుల, మత భేదాలు లేకుండా విద్య, వసతి, భోజనం కల్పించి నడిచే దేవుడిగా కీర్తి పొందిన తుమకూరు సిద్దగంగా మఠాధిపతి డాక్టర్ శివకుమారస్వామికి భారతరత్న ఇవ్వాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య డిమాండ్ చేశారు. దావణగెరెలో సీఎం మీడియాతో మాట్లాడుతూ శివకుమారస్వామికి కూడా భారతరత్న గౌరవం ఇవ్వాలన్నారు. మరణానంతరం ఆయనకు భారతరత్నతో గౌరవించడం సముచితంగా ఉంటుందన్నారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాస్తామని సీఎం తెలిపారు. విజయపురలో ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ ఎల్‌కే ఆడ్వాణీ దేశంలో సీనియర్ రాజకీయ నేత అన్నారు. ఆయనకు భారతరత్న ఇవ్వడంలో తమకెటువంటి అభ్యంతరం లేదన్నారు. రాష్ట్రానికి చెందిన నడిచే దేవుడిగా పేరొందిన శివకుమారస్వామికి అదే గౌరవం దక్కాలన్నారు. గతంలోనే స్వామిజీకి భారతరత్న ఇవ్వాలని విన్నవించామన్నారు. పేదలకు అన్నదానం చేయడంలో స్వామిజీకి ప్రత్యేకమైన పేరుందన్నారు. పేద చిన్నారులను ప్రపంచ వ్యాప్తంగా రాణించేలా తీర్చిన ఘనత స్వామిజీదే అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ రణదీప్‌సింగ్ సుర్జేవాలా ఒక ప్రకటన విడుదల చేస్తూ.. అన్నం, అక్షర జ్ఞానం, వసతి కల్పించిన మహాపురుషుడు శివకుమారస్వామిజీకి భారతరత్న లభించాలన్నారు. ఈ గౌరవానికి ఆయనలాంటి అర్హులు మరొకరు లేరన్నారు. ఇప్పటికే స్వామిజీకి భారతరత్న దక్కాల్సి ఉండేదన్నారు.

కొలిక్కి కాంగ్రెస్ జాబితా

- 15 స్థానాలకు ఒకే పేరు
- 13 స్థానాల ఎంపికకు కసరత్తు




బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల జాబితాను కొలిక్కి తీసుకురావడంతో ముందంజలో ఉంది. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలు ఉండగా 15 స్థానాలకు ఒకే అభ్యర్థి పేరుతో జాబితాను సిద్ధం చేసింది. వీటిలో దాదాపు మార్పులు ఉండవని తెలుస్తోంది. ఈ జాబితాను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ముందు ఉంచాలని నిర్ణయించారు. లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఖరారు విషయమై దాదాపు మూడు నెలలుగా ముఖ్యమంత్రి సిద్దరామయ్య, డీసీఎం, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ కసరత్తు సాగించారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా సమక్షంలోనే నియోజకవర్గాల వారీగా సమీక్షలు సాగాయి. తాజాగా గురువారం మంత్రివర్గ సమావేశం ముగిశాక రాత్రి సీఎం అధికారిక నివాసం కావేరిలో మంత్రులకు ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ సందర్భంలోనే 15 నియోజకవర్గాలకు ఒకే పేరుతో రూపొందించిన జాబితాపై చర్చలు సాగించారు. మంత్రులు సానుకూలంగానే స్పందించడంతో అదే జాబితా అధిష్టానానికి పంపదలిచారు. మరో 13 నియోజకవర్గాలకు అభ్యర్థుల విషయమై ఆచితూచి వ్యవహరిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ-జేడీఎస్‌కు చెందిన ముఖ్యులు కాంగ్రెస్‌లోకి రావచ్చునని, ముందుగానే జాబితా ప్రకటిస్తే కొన్ని సమస్యలు తలెత్తవచ్చునని భావిస్తున్నారు. సమావేశంపై భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి చర్చ జరిగిందని, ఇన్‌చార్జ్ మంత్రులు, పరిశీలకులు ఉన్నారన్నారు. ప్రజాపనులశాఖ మంత్రి సతీశ్ జార్కిహోళి బెళగావిలో మాట్లాడుతూ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులు అభ్యర్థుల పేర్లు ఇవ్వాలని సూచించినందుకు అనుగుణంగా 15 నియోజకవర్గాలకు ఒక్కొక్కపేరు ఖరారైందని, తదుపరి నిర్ణయం పార్టీ పెద్దలు తీసుకుంటారని తెలిపారు.

రాజకీయ ఆందోళనలు

- నిధుల కేటాయింపులో రాష్ట్రానికి అన్యాయంపై ఢిల్లీలో కాంగ్రెస్..
- కరువు ప్రాంతాలను పట్టించుకోలేదని రాష్ట్రంలో బీజేపీ..
- 7న అధికార, ప్రతిపక్షాల నిరసనలు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ వేర్వేరుగా ఆందోళనలకు సిద్ధమవుతున్నాయి. కేంద్రప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులతో పాటు జీఎస్టీ వాటాలోనూ అన్యాయం చేస్తోందని ఈనెల 7న ఢిల్లీలో నిరసనకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమయ్యారు. కేంద్రప్రభుత్వం అన్యాయాన్ని ఎండగట్టేందుకు రాష్ట్రం నుంచి భారీగా ఢిల్లీ వెళ్లనున్నారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఢిల్లీలో నిరసన చేపడుతున్నట్లు శుక్రవారం ప్రకటించారు. అంతలోనే అప్రమత్తమైన బీజేపీ రాష్ట్ర నాయకులు అందుకు దీటుగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వంపై భారీ స్థాయిలో ఆందోళన చేయనున్నట్లు ప్రకటించారు. శనివారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర అధ్యక్షతన కోర్‌కమిటీ భేటీలో అగ్ర నాయకులంతా కలిసి ఈ మేరకు తీర్మానించారు. ఈనెల 7న రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఖరిపై నిరసన చేయనున్నట్లు సీనియర్‌నేత సీటీ రవి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో 222 తాలూకాల్లో కరువు ప్రాంతాలుగా ప్రకటించి నెలలు ముగుస్తున్నా ఎటువంటి ప్రత్యేక నిధులు విడుదల చేయలేదని మండిపడ్డారు. ప్రభుత్వం రైతులకు వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలు దెబ్బతిన్నాయని, రబీలో సాగు చేసే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పశుగ్రాసం కొరత ఉందని, పల్లెల్లో తాగునీటికి సమస్య తీవ్రమవుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 7న విధానసౌధ, వికాససౌధ మధ్య గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తామన్నారు. బీజేపీకి చెందిన అన్ని విభాగాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో ఆందోళన చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా పదేళ్ల వ్యవధిలో రూ.1.42 లక్షల కోట్ల గ్రాంట్లు విడుదల చేయగా ప్రధాని నరేంద్రమోదీ రూ.4.31 లక్షల కోట్లు గ్రాంట్లు కేటాయించారని, గతంతో పోల్చితే ఇది మూడురెట్లు అధికమని తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.25	1,615.52
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	272	9,546
సామర్థ్యం (టీఎంసీలు)	9.63	49.66

డిజిటల్ పద్ధతిలోనే భూసర్వే


భూసర్వే అధికారి శ్రీనాథ్

కంప్లి, ఫిబ్రవరి 03 : ఇకపై డిజిటల్ పద్ధతిలోనే భూ సర్వేలు చేపడుతున్నట్లు జిల్లా భూసర్వే శాఖ అధికారి శ్రీనాథ్ తెలిపారు. భూసర్వే శాఖ ఆధ్వర్యంలో తాలుకాలోని 26గ్రామాలలో జరిగిన సర్వేలపై తనిఖీలు చేపట్టామన్నారు. ఇప్పటివరకూ జరిగిన 46 లైసెన్స్ సర్వేలు, 26 ప్రభుత్వ సర్వేలలో డ్రోన్ ద్వారా తనిఖీ చేపట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ పద్ధతి ద్వారా చుట్టుపక్కల రైతన్నలకు, ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఈ సర్వేలను ప్రారంభించిందన్నారు. హోస్పేట, హగరి బొమ్మనహళ్లిలలో ప్రతి ఒక్కరు డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారన్నారు. త్వరలో రాష్ట్ర ప్రభుత్వం నూతన అధికారులు, సిబ్బందిని నియమిస్తే ప్రజలకు, రైతులకు అందరికీ అనుకూలంగా వుంటుందన్నారు. తాలుకాఅధికారి నూరుద్దీన్, మాంతేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విశ్రాంత సైనికులు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 03 : బళ్లారి జిల్లా సిడిగినమల గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు దేశ రక్షణలో పారామిలిటరీ బలగాల పాత్ర గురించి విశ్రాంత సైనికులు బోర్డుపై మ్యాప్ వుంచి వివరంగా తెలియజేశారు. ఈ సందర్భంగా కళ్యాణ కర్నాటక మాజీ అర్రే సేన సంఘం కార్యదర్శి బీఎస్ ప్రహ్లాద రెడ్డి, సహ కార్యదర్శి రాజసింహ, ఉపాధ్యక్షులు ఈశ్వరరెడ్డి, డైరెక్టర్లు లక్ష్మణ్ షేక్ సాబ్, గోవిందరాజులు, పాఠశాల ఉపాధ్యాయులు గోవర్ధన్ రెడ్డి, గౌసి సిద్దిఖ్, సుల్తాన్, మోహన్ కుమార్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సిరుగుప్ప, ఫిబ్రవరి 03 :తాలుకాలోని రావిహాళ్ గ్రామంలో రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే బీఎం నాగరాజు ప్రారంభించారు. చిన్న పిల్లలకు పుష్టికరమైన ఆహారం అందేలా చూసుకోవాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. కేకేఆర్‌డీబీ నిధుల కింద ఈ పనులు జరిగాయి. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధ్యక్షులు జయరామిరెడ్డి, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చదువుతోనే పిల్లల్లో అభివృద్ధి


పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కంప్లి, ఫిబ్రవరి 3 : కుడితిని పట్టణంలో ప్రతి ఇంట పిల్లలకు చదువులు చెప్పించాలని ఎమ్మెల్యే ఈ తుకారామ్ సూచించారు. ఆయన శనివారం కుడితిని పట్టణం హరిగిణదోణి రోడ్డులోని వాల్మీకి స్కూలును ప్రారంభించారు. డీఎంఎఫ్ నిధులు రూ. 98 లక్షలతో పాఠశాలను నిర్మించామన్నారు. ఇక పిల్లలను ఇళ్లకే పరిమితం చేయకుండా పాఠశాలలో చేర్పించాలని సూచించారు. గతంలో రాజశేఖర్ అధ్యక్షులుగా వున్న సమయంలో పాఠశాల అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, కాలువ అభివృద్ధి పనులు, అంగన్‌వాడీ కట్టడాలు ఏర్పాటు చేసేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయనతోపాటు కౌన్సిలర్లు మంజునాథ, కణికేరి పంపాపతి, లెనిన్, యుకేసీ చంద్రన్న, దొడ్డ బసప్ప, డీఈవో సిద్దలింగమూర్తి, హెచ్‌ఎం భవాని, కాంట్రాక్టర్ బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

కత్తులును, ఘంటములు కదనుతొక్కి నవిచట!


ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హంపీలోని విరుపాక్షేశ్వరస్వామి ఆలయం ఉత్సవాల సందర్భంగా పర్యాటకులతో రద్దీగా మారింది.

గగనవిహారం


హంపి అందాలను చూడడానికి ఏర్పాటుచేసిన హెలికాప్టర్ బైస్కై అందరినీ ఆకట్టుకుంది. విహంగ వీక్షణకు జనం బారులు తీరారు.

సిరిధాన్యాలు


సిరిధాన్యాలుగా ప్రపంచమంతా గుర్తింపుపొందుతున్న రాగులు, సజ్జలు, జొన్నలు ఈ ప్రాంతంలో బాగా పండుతాయి. ప్రదర్శనలో ఇవి హైలైట్‌గా నిలిచాయి.

కలెక్టర్ బేరం


సిరి ధాన్యాల ప్రదర్శనలో కలెక్టర్ దివాకర్ పాల్గొని స్వయంగా బేరమాడారు.

పుచ్చకాయనేతలు


పుచ్చకాయలపై చిత్రీకరించిన గాంధీ, నెహ్రూ, సుభాష్‌చంద్ర బోస్ లాంటి దేశనాయకుల ఫొటోలు అందరినీ ఆకట్టుకున్నాయి.

విజయ విహారం


విద్యారణ్యపీఠ హైస్కూలు మైదానంలో కుస్తీ పోటీలు

హంపీ ఉత్సవాల్లో రెండవ రోజు అటు యుద్ధక్రీడలు, ఇటు సంగీత కచేరీలు ప్రజలను పూర్తిగా ఆకట్టుకున్నాయి. ఈ దృశ్యాలు అలనాటి రాయల పరిపాలననను మరొకసారి గుర్తుకు తెచ్చాయి. ఆ కాలంలో ఖడ్గవిన్యాసాలకు ఎంతటి విలువనిచ్చేవారో, కవిత్వానికి కూడా అంతటి విలువనే ఆపాదించేవారు. ఈ కారణంగానే విజయనగర సామ్రాజ్యం ఒక వెలుగు వెలిగింది. వీటికి తోడు మల్లయుద్ధ ప్రదర్శనలు, సంకీర్తనలు సరేసరి. హెలికాప్టర్ బైస్కై ఆకర్షణతో శనివారం కూడా పర్యాటకులు హంపీకి అధిక సంఖ్యలో పోటెత్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటుచేయడంతో మారుమూల గ్రామాల నుంచి కూడా మహిళలు భారీఎత్తున తరలివచ్చారు. గాయత్రీ వేదికలో అనురాధ భట్ గానమాధుర్యం శ్రోతలను మైమరపింపజేసింది. - కంప్లి,హొసపేటె


కర్ణాటక సంగీతమంటే కన్నడిగులు చెవి కోసుకుంటారు. ఉత్సవాల్లో కళాకారులు సంకీర్తనలతో ఆకట్టుకున్నారు.

ఒంటిచేయి వీరుడు


రెండు చేతులతో చక్రం తిప్పడమే కష్టం. అలాంటిది మల్పనగుడి వద్ద ఒంటిచేత్తో నే బండికి చక్రం మార్చాడు ఓ వీరుడు

ఆపాత మధురం


గాన మాధుర్యానికి ఎవరైనా దాసోహమనాల్సిందే.తీయని పాటలతో అనురాధ భట్ ఆకట్టుకున్నారు.

అజ గర్వం

కోడిపందాలు లాగా పొట్టేలు పోటీలకు హంపీ ప్రాంతం ఎంతో ప్రసిద్ధి. ఇక్కడ పొట్టేళల ళ్లకు కొమ్ములు మెలితిరిగి ఉండడం ప్రత్యేకత. ఉత్సవాల్లో పొట్టేళ్ల పోటీలు గ్రామీణులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



ఫ్రీ బస్ రెడీ!

ఎలాగూ బస్సు ఉచితమే. హంపీ చూసి వస్తే పోలా! అంటూ మహిళలు, వారితో పాటు వారి భర్తలు ఉత్సవాలకు క్యూ కట్టారు.



కళా బృందాలకు పుట్టినిల్లు హంపి : ఎమ్మెల్యే


ఎమ్మెల్యే గవియప్ప

బళ్లారి, ఫిబ్రవరి 03 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ దేశాలలో హంపీకి ప్రత్యేక స్థానం వుందని కళలు సాంస్కృతిక కార్యక్రమాలలో ప్రపంచ దేశాలకే పుట్టినిల్లు అని విజయనగర ఎమ్మెల్యే గవియప్ప పేర్కొన్నారు. మూడు రోజుల పాటు జరుగుతున్న హంపీ ఉత్సవాల్లో రెండవ రోజైన శనివారం విరుపాక్షేశ్వర వేదికలో ఆయన పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానవ మనుగడకు ఎంతైనా అవసరమన్నారు. సాంస్కృతిక వికాసాన్ని పెంచుతాయని పేర్కొన్నారు. ఆనాటి సాంప్రదాయాలను గుర్తుంచుకుని ప్రతి యేటా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించడం వల్ల ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు. విజయనగర జిల్లా కలెక్టర్ దివాకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా హంపీలో ఉత్సవాలను నిర్వహించేందుకు ప్రోత్సహిస్తున్నారన్నారు. రెండవరోజు శనివారం హంపీ ఉత్సవాలలో విశేషంగా జనం పాల్గొన్నారు. నాలుగు వేదికల నుంచి అనేక సాంస్కృతిక కార్యక్రమాలు, నాట్యాలు, సంగీత కచేరీలు భారీగా జరిగాయి. ప్రజలను ఈ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

విద్యావిధానం ప్రజోపయోగకరంగా ఉండాలి


పుస్తకావిష్కరణలో ప్రొఫెసర్ మురిగెప్ప తదితరులు

రాయచూరు, ఫిబ్రవరి 3 : విద్యా విధానం ఎలాంటిదైనా అది సమాజహితాన్ని కాంక్షించేదిగా ఉండాలని హంపి కన్నడ విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి ప్రొఫెసర్ ఎ.మురిగెప్ప అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో నూతన జాతీయ విద్యావిధానానికి వ్యతిరేకంగా అవిశ్రాంత పోరాటం సాగిస్తున్న ఏఐడీఎస్ఓ నిబద్ధతను ఆయన ప్రశంసించారు. నూతన విద్యావిధానంపై విస్తృత విశ్లేషణకు సంబంధించిన పుస్తకాన్ని శనివారం బెంగళూరులోని గాంధీ భవన్‌లో విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి రాయచూరు జిల్లా నుంచి పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ఏఐడీఎస్ఓ ప్రతినిధులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ ఎ.మురిగెప్ప మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ఎలాంటి ముందస్తు చర్చ విశ్లేషణలు అభిప్రాయ సేకరణ లేకుండా అమలు చేసిన నూతన విద్యావిధానం 2020 వల్ల అనేక సమస్యలు తలెత్తాయన్నారు. మూడేళ్లడిగ్రీని నాలుగేళ్లకు పెంచినా అందుకు తగిన సౌకర్యాలు లేకపోవడం బాధ్యతరాహిత్యమన్నారు.

హోసూరు జోన్

సీసీ కెమెరాల్లో రికార్డయిన పులుల చిత్రాలు


డెంకణీకోట జవలగిరి అడవిలో రెండు పులుల సంచారం

హోసూరు ఫిబ్రవరి 3 : కృష్ణగిరి జిల్లా హోసూరు జవలగిరి అటవీ ప్రాంతంల్లో రెండు పులులు సంచారం చేస్తున్న దృశ్యాలు సీసీటీవీ కెమరాల్లో రికార్డు అయ్యాయి. కావేరి ఉత్తర వన్యప్రాణుల అభయారణ్యంలోని హోసూరు, జవలగిరి రిజర్వ్ పారెస్ట్ ప్రాంతంల్లో 50 ఏళ్ల తర్వాత రెండు పులులు కనిపించడం షాకింగ్‌గా మారింది. పులుల్లో ఒక దానికి నాలుగు నుంచి, ఐదేళ్ల వయస్సు ఉంటుంది. మరో పులికి 8 నుంచి 9ఏళ్ల వయస్సు ఉంటుంది. సీసీటీవి కెమరాల్లో ఈ రెండు మగ పులుల ఫోటోలు రికార్డు అయ్యాయని ఛీప్ కన్సర్వేటర్ ఆఫ్ పారెస్ట్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ రెండు ఛాయచిత్రాలు జనవరి 2024లో కృష్ణగిరి జిల్లా, హోసూరు వనకోట్టం జవలగిరి రిజర్వ్ ఫారెస్ట్‌ల్లో అమర్చిన కెమరాల్లో రికార్డు అయ్యాయి. అభయారణ్యం ప్రక్కనే ఉన్న అటవీ ప్రాంతాలలో పులుల సంచారం చేసే బన్నేరుఘట్ట అటవీప్రాంతంలో, దాని సమీపంలోని ప్రాంతాలలో ఈ జాతుల పులులు ఉంటాయన్నారు. వీటిని రక్షంచడానికి తమిళనాడు ప్రభుత్వం తీసుకున్న విజయవంతమైన చర్యల కారణంగా పులులు కన్పిస్తున్నాయని పర్యావరణం, వాతావరణ అదనపు కార్యదర్శి తెలిపారు.

అన్నాదురైకు ఘన నివాళులు

హోసూరు, ఫిబ్రవరి 3: కృష్ణగిరి తూర్పు జిల్లా శూలగిరి పడమటి యూనియన్ పరిధిలోని చిన్నరానదొడ్డి పంచాయతీ గుడిసాతనపల్లిలో తమిళనాడు రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి అన్నాదురైకు ఘన నివాళులు సమర్పించారు. అన్నాదురై 55వ వర్ధంతిని పురస్కరించుకుని పలు చోట్ల వివిధ పార్టీల నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా శూలగిరి పశ్చిమ యూనియన్ అన్నాడీఎంకే కార్యదర్శి బాబు అలియాస్ వెంకటాచలం నేతృత్వంలో శనివారం కార్యక్రమాలు జరిగాయి. తొలుత అన్నాదురై చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అన్నాదురై దూరదృష్టిని, ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో శూలగిరి వెస్ట్ యూనియన్ కోశాధికారి టీ నారాయణప్ప, జిల్లా ప్రతినిధి నాగేశ్, అలసదనపల్లి నారాయణస్వామి, పంచాయతీ ఉపాధ్యక్షుడు మధు, మాజీ అధ్యక్షుడు జీఎస్ వెంకటేశ్, ఎంజీఆర్ ఫోరం ఉపాధ్యక్షుడు మునేగౌడ, అన్నాడీఎంకే నాయకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం సహాయక మహిళలకు సౌకర్యాలు అందాలి


రాయచూరు, ఫిబ్రవరి 3: గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సేవలందించే స్వయం సహాయక మహిళలకు గ్రామ పంచాయతీల ద్వారా మెరుగైన సౌకర్యాలు అందేలా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ కృషి చేయాలని జడ్పీ ప్లానింగ్ గణాంక అధికారి హులిగెప్ప సూచించారు. శనివారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో పంచాయత్ రాజ్ ఇతర క్లస్టర్ ఆధారిత సంఘ సంస్థల కార్యకర్తల కోసం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సమావేశంలో పాల్గొన్న అధికారి హులిగెప్ప మాట్లాడుతూ, గ్రామ పంచాయతీల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం వివిధ పథకాల ఆధారంగా అనేక రకాల సేవలు అందజేస్తున్నట్లు వివరించారు. ఆ సేవలన్ని స్వయం సహాయక సంఘాల మహిళలకు చేరేలా క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ కృషి చేయాలన్నారు.


మాట్లాడుతున్న జడ్పీ ప్లానింగ్ గణాంక అధికారి హులిగెప్ప

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

భీమ్‌సేన్ జోషి (జయంతి)



'భారతరత్న' అందుకున్న తొలి హిందూస్తానీ శాస్త్రీయ సంగీత కళాకారుడు పండిట్ భీమ్‌సేన్ గురురాజ్ జోషి 1922 ఫిబ్రవరి 4న (గతంలో ధారవాడ జిల్లా) గదగ్ జిల్లా రోణ తాలూకాలో జన్మించారు. గురువు సవాయి గంధర్వ వద్ద శిష్యుడిగా చేరి 'కిరానా ఘరానా' శైలిలో ఖయాల్ గానంలో పేరొందారు. భజనలు, అభంగాలు పాడడంలో సిద్ధహస్తులు. న్యూయార్క్‌లో కచేరీ ఇచ్చిన తొలి భారతీయ సంగీతకారులు. పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మభూషణ్, మహారాష్ట్రభూషణ్, సంగీత నాటక అకాడమీ ఫెలోషిప్ తదితర పురస్కారాలు పొందారు. జాతీయ ప్రతిపత్తిపై రూపొందించిన సంగీతపరమైన వీడియో 'మిలే సుర్ మేరా తుమారా...' ఎంతో ప్రసిద్ధి చెందింది. గురువు సవాయి గంధర్వ జ్ఞాపకార్థం ఏటా పూనెలో సంగీతోత్సవం నిర్వహించేవారు. 2011 జనవరి 24న కన్నుమూశారు.

బిర్జూ మహరాజ్ (జయంతి)



'పద్మ విభూషణ్' గ్రహీత బిర్జూ మహరాజ్ 1938 ఫిబ్రవరి 4న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవ్ ప్రాంతంలో జన్మించారు. అసలు పేరు బిర్జూ మోహన్‌నాథ్ మిశ్రా. తండ్రి, మేనమామల ప్రోత్సాహంతో కథక్ నాట్య కళాకారుడిగా రాణించారు. చిన్నతనం నుంచి నాట్యంపై మక్కువ ఉన్నా హిందూస్తానీ గాత్రంలో కూడా ఆరితేరారు. కథక్ నాట్యానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చారు. సంగీత నాటక అకాడమీలో ప్రధాన నాట్యాచార్యుడిగా వ్యవహరించారు. దేశ విదేశాల్లో వేలాది నాట్య ప్రదర్శనలు ఇచ్చారు. ఆంధ్ర రత్న, నృత్య చూడామణి, కాళిదాస్ సమ్మాన్ తదితర పురస్కారాలు సహా గౌరవ డాక్టరేట్ పొందారు. 2022 జనవరి 17న కన్నుమూశారు.

పద్మా సుబ్రహ్మణ్యం (పుట్టినరోజు)



'పద్మభూషణ్' గ్రహీత పద్మా సుబ్రహ్మణ్యం 1943 ఫిబ్రవరి 4న మద్రాస్‌లో జన్మించారు. భరతనాట్య కళాకారిణి, పరిశోధకురాలు, కొరియోగ్రాఫర్, స్వరకర్త, సంగీత దర్శకురాలు, ఉపాధ్యాయిని, రచయితగా బహుముఖ ప్రజ్ఞాశాలి. పలు దేశాలలో పర్యటించి భరతనాట్యానికి వన్నె తెచ్చారు. జపాన్, ఆస్ట్రేలియా, రష్యా వంటి దేశాలలో ఆమె గౌరవార్థం లఘు చిత్రాలు రూపొందించబడ్డాయి. నృత్యం, నాటకాలలో ఏకపాత్రాభినయం చేయడం ప్రత్యేకత. పద్మశ్రీ, కలైమామణి తదితర పురస్కారాలు పొందారు.

మోకాలి నొప్పుల నియంత్రణకు ప్రత్యేక సర్జరీ

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మోకాలి నొప్పు లతో భారీ కాయం కల్గిన మహిళకు నగరంలోని సాగర్ ఆసుపత్రి వైద్యులు మెరుగైన చికిత్సలు అందించారు. బెంగళూరుకు చెందిన 55ఏళ్ల మహిళ 125 కేజీల బరువు ఉండేవారు. స్థూలకాయం, బీపీ వంటి సమస్యలతో సుదీర్ఘకాలంగా మోకాలినొప్పులతో బాధపడుతుండేవారు. సాగర్ ఆసుపత్రి వైద్యులు ఏక కాలంలో రెండుకాళ్లకు చికిత్సలు జరిపారు. సాధారణంగా మోకాలి చిప్పల మార్పిడి ఒకేసారి చేయరు. కానీ ప్రయోగాత్మకంగా సాగర్ ఆసుపత్రి నిపుణులు డాక్టర్ యోగీశ్వర్ నేతృత్వంలో చికిత్సలు జరిపారు. 15 రోజుల వ్యవధిలోనే ఆమె సాధారణంగా నడక సాగించారు. ఈ మేరకు ఆసుపత్రి ఒక ప్రకటన విడుదల చేసింది.

మంగళూరులోనూ ఐకియా సేవలు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో పేరొందిన ఐకియా సంస్థ మంగళూరులోనూ అందుబాటులోకి వచ్చింది. స్వీడిష్ ఒమ్ని చానెల్ గృహోపకరణాల రిటైల్ మార్కెట్ ద్వారా ద్వితీయ శ్రేణి నగరాలలోనూ వ్యాపార విస్తరణ చేపట్టింది. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తెలంగాణలో 62 జిల్లాల్లో తన ఇ-కామర్స్ ద్వారా సేవలను తీసుకొచ్చింది. ఐకియా ఇండియా సీఎస్ఓ సుసానె హుల్వేరర్ మాట్లాడుతూ ఐదేళ్ల వ్యవధిలో మహారాష్ట్రతో కలిపి దక్షిణభారత్‌లో లక్షలాదిమంది వినియోగదారుల విశ్వాసాన్ని పొందామన్నారు. బెంగళూరు, హైదరాబాద్‌లలో భారీ షోరూంలు ఉన్నాయని సమీప పరిధిలోని పట్టణాలకు విస్తరింపచేస్తున్నామన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలనే ప్రాంతాలవారీగా పాయింట్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఆర్థిక, జీవన భద్రతకు పాలసీలు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎస్‌బీఐ జీవితబీమా ఆధ్వర్యంలో ప్రజలకు ఆర్థిక, జీవన భద్రత కల్పించే దిశగా రెండు పాలసీలను అందుబాటులోకి తెచ్చింది. ఎస్‌బీఐ లైఫ్ సరళ్ స్వధన్ సుప్రీమ్, స్మార్ట్ స్వధన్ సుప్రీమ్ పాలసీలను ఆరంభించినట్టు సంస్థ బిజినెస్ హెడ్ అభిజిత్ గులానికర్ అభిప్రాయపడ్డారు. వినియోగదారులకు ఆర్థిక రక్షణ గ్యారెంటీతోపాటు జీవితానికి భద్రత కల్పించేలా పాలసీలు ఉంటాయన్నారు. ప్రతి వ్యక్తి తనకు అనుకూలమైన పాలసీలు పొందవచ్చునన్నారు. 7, 10, 15ఏళ్ల పాలసీలతోపాటు 10-30ఏళ్ల పాలసీ గడువు, వందశాతం మెచ్యూరిటీ లాభం ఉందన్నారు. రెండు పాలసీలు కనీసబీమా రూ.25 లక్షలుగా ఉంటుందన్నారు.

గాంధీ, అంబేడ్కర్ తరహాలో..

పాత్రికేయులు చైతన్యం తీసుకురావాలి

- గ్రామీణ జర్నలిస్టులకు బస్సు పాసులు
- దావణగెరె జర్నలిస్టుల సదస్సులో సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): మూఢ నమ్మకాలు, కర్మ సిద్ధాంతాలను వీడి సమాజానికి వాస్తవాలను అందించే జర్నలిజం అవసరమని మహాత్మాగాంధీ, అంబేడ్కర్‌లు పాత్రికేయులుగా నిరంతరం ప్రజలను చైతన్యం తీసుకొచ్చారని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. దావణగెరెలో కర్ణాటక వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ 38వ సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పాత్రికేయులను ఉద్దేశించి సీఎం మాట్లాడుతూ జర్నలిస్ట్‌లకు రాజకీయాలు అవసరం లేదని, వాస్తవాలు ముఖ్యమన్నారు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఆర్థిక శక్తిని పెంపొందించే గ్యారెంటీలకు ఉచితమంటూ ఎద్దేవా చేసేలా ప్రస్తావించరాదన్నారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, పరిశీలించి కథనాలు చేయాలని సలహా ఇచ్చారు. ఇటీవలికాలంలో భార్యాభర్తల గొడవలను రోజంతా చూపే పరిస్థితి వస్తోందని, ఇది సమాజ అభివృద్ధి జర్నలిజం కాదన్నారు. శ్రీమంతులు, ధనవంతుల చేతుల్లో పత్రికారంగం చేరిందన్నారు. పేదల ఆసక్తికి వ్యతిరేకంగా కథనాలు ప్రమాదకరమన్నారు. సామాన్యులు పాత్రికేయ వృత్తిపై ఎన్నో ఆశయాలు, నమ్మకాలు పెట్టుకున్నారని వాటిని విస్మరించ రాదన్నారు. సాంకేతిక రంగాన్ని పాత్రికేయులు సద్వినియోగం చేసుకోవాలని అయితే వాస్తవాలను ఎప్పటికీ వీడరాదన్నారు. అసోసియేషన్ వినతి మేరకు గ్రామీణ పాత్రికేయులకు ఉచిత బస్ పాస్ అంశమై పరిశీలించి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి మీడియా సలహాదారుడు కేవీ ప్రభాకర్ సారథ్యంలో జరిగిన సభకు వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు శివానంద తగడూరు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి శ్యామనూరు శివశంకరప్ప, మంత్రులు ఎస్ఎస్ మల్లికార్జున, రామలింగారెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.



సదస్సు వేదికపై సీఎం సిద్ధరామయ్య తదితరులు

ఘనంగా చన్నరాయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 3: తాలూకాలోని జంగమకోటె హోబళి హేమార్లహళ్ళిలో శ్రీదేవి భూదేవి సమేత చన్నరాయస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, విమాన గోపుర, మహా సంప్రోక్షణ, నూతన విగ్రహ ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ అయోధ్యలో బాలరాముడి ప్రతిష్ఠాపన తరహాలో గ్రామంలోనూ స్వామివారి ప్రతిష్ఠాపన కార్యక్రమాలు సాగాయన్నారు. ధార్మిక కార్యక్రమాలలో ఎవరూ రాజకీయాలు చేయరాదనేది తన అభిప్రాయంగా పేర్కొన్నారు. భగవంతుడి ఆశీర్వాదంతో ఒక రైతుబిడ్డనైన తనను ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. అందుకు కృతజ్ఞతగా ప్రజలందరికీ విద్యాభ్యాసం, మెరుగైన వైద్యం, గ్రామాల అభివృద్ధి తన లక్ష్యమన్నారు. ప్రతిఒక్కరూ శాంతియుత జీవనం సాగించాలని ఆకాంక్షించారు. ఆదిచుంచనగిరి చిక్కబళ్ళాపురశాఖ మఠం మంగళనాథస్వామి భక్తులనుద్దేశించి ప్రవచనం చేశారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్ళాపుర జిల్లాల్లో శ్రమజీవులు, విద్యావంతులు అధికమని అదే విధంగా ధార్మికంగాను జిల్లా ముందంజలో ఉందన్నారు. గ్రామస్థులంతా చేరి ఆలయాన్ని జీర్ణోద్ధరణ చేయడం సంతోషంగా ఉందన్నారు. కాగా బుధవారం ప్రారంభమైన కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. గంగపూజ, గోపూజ, మృత్యంగ్రహణ, విశ్వక్సేన, యాగశాల ప్రవేశం, ధ్వజ కుంభారాధన, వివిధ హోమాలు, విమానగోపుర మహాసంప్రోక్షణ, నూతన విగ్రహ ప్రతిష్ఠాపన, మహామంగళారతి, తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఉత్సవాల్లో మాజీ మంత్రి వీ మునియప్ప, తహసీల్దార్ బీఎన్ స్వామి, తాదూరు రఘు, ఎస్ఎన్ క్రియా ట్రస్టు యువకుడు సుమన్, ఏబీడీ గ్రూప్ అధ్యక్షుడు రాజీవ్‌గౌడ, భక్తరహళ్ళి బైరేగౌడ, తాదూరు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న ఆదిచుంచనగిరి మఠం మంగళనాథ స్వామి, ఎమ్మెల్యే రవికుమార్

ఉత్సాహంగా తిరంగా ర్యాలీ

చిక్కబళ్ళాపుర, ఫిబ్రవరి 3: జిల్లా కేంద్రమైన చిక్కబళ్ళాపురలో ఎంఎస్ రామయ్య యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతినిర్మాణం కోసం మెగా తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఫౌండేషన్ సంస్థాపక అధ్యక్షుడు ఎంఎస్ రక్షా రామయ్య ఆధ్వర్యంలో ఎంజీ రోడ్డు నుంచి భోగనందీశ్వర దేవస్థానం వరకు జాథా సాగింది. జాతీయ పతాకాలు చేబూని పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. బైక్ ర్యాలీని ప్రారంభించిన అనంతరం రక్షా రామయ్య మాట్లాడుతూ స్వాతంత్ర్యం పూర్వం నుంచి దేశం కోసం కాంగ్రెస్ శ్రమిస్తోందన్నారు. అయితే ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణలో ప్రధాని మోదీ విఫలమయ్యారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్నారని, యువతకు తగిన ఉద్యోగాలు కల్పించలేదన్నారు. ర్యాలీలో బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, పదాధికారులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.



చిక్కబళ్ళాపుర తిరంగా ర్యాలీలో రక్షా రామయ్య తదితరులు

6 నుంచి సుత్తూరు జాతర



మీడియాతో జేఎస్ఎస్ విద్యాపీఠం కార్యదర్శి మంజునాథ్

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మైసూరు జిల్లా నంజనగూడు తాలూకా సుత్తూరు గ్రామంలో జరిగే జాతర మహోత్సవానికి ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్టు జేఎస్ఎస్ విద్యాపీఠం కార్యదర్శి ఎస్పీ మంజునాథ్ వెల్లడించారు. జగద్గురు శివరాత్రీశ్వర శివయోగి జాతర ఈనెల 6నుంచి 11వరకు జరగనుందని వివిధ కార్యక్రమాలు ఉంటాయని జేఎస్ఎస్ విద్యాపీఠం కార్యదర్శి మంజునాథ్ వెల్లడించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పలు ధార్మిక, సాంస్కృతిక, విద్యా కార్యక్రమాలు ఉంటాయన్నారు. 6న కొండోత్సవం, 7న సామూహిక వివాహాలు, 8న రథోత్సవం, 9న లక్ష దీపోత్సవం, 10న తెప్పోత్సవం, 11న అన్నబ్రహ్మోత్సవంతో జాతర ముగియనుందన్నారు. భజనలు, రంగవల్లులు, చిత్రలేఖనం, గాలిపటం పోటీలతో చిత్రసంత, పశువుల పరుష, దోణీ విహారం ఉంటాయన్నారు. ఆరు రోజులపాటు సాగే జాతరలో సుమారు 25లక్షలమంది సందర్శించే అవకాశం ఉందని, అన్నదాసోహానికి వెయ్యి క్వింటాళ్ల బియ్యం, 180 క్వింటాళ్ల కందిబేడలు, 1500 కేన్లలో వంటనూనె, 12 టన్నుల బెల్లం, 4వేల కేజీల కారప్పొడి, 250 క్వింటాళ్ల చక్కెర, 500 కేజీల నందిని నెయ్యి, 8వేల లీటర్ల పాలు, 28వేల లీటర్ల పెరుగు, 5వేల కేజీ ఊరగాయ సిద్ధం చేశామన్నారు. ఈసారి కూడా వ్యవసాయ మేళా ఉంటుందని, పలు రకాల పుష్పాలు, కూరగాయల ప్రదర్శన ఉంటుందన్నారు. కాగా ఈనెల 10న కేంద్ర హోం మంత్రి అమిత్‌షా విచ్చేసి అతిథి గృహాన్ని ప్రారంభించనున్నారని వెల్లడించారు.

బ్యాడ్మింటన్‌లో మెలకువలు నేర్చుకోండి

- షట్లర్ చిరాగ్‌శెట్టి పిలుపు

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బ్యాడ్మింటన్‌లో మరిన్ని మెళకువలు నేర్చుకోవాలని తద్వారా ఉన్నతశిఖరాలకు చేరవచ్చునని అంతర్జాతీయ గుర్తింపు పొందిన షట్లర్ చిరాగ్‌శెట్టి సూచించారు. బెంగళూరు బ్యాడ్మింటన్ కప్ విజేతలతో శనివారం ముఖాముఖి నిర్వహించారు. చిరాగ్‌శెట్టి తన అనుభవాలను పంచుకున్నారు. బెంగళూరు బ్యాడ్మింటన్ కప్ ఫైనల్స్ పోటీలను వీక్షించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నిప్పాన్ పెయింట్స్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నిప్పాన్ ఇంటీరియర్ చైర్మన్ మహేశ్ ఆనంద్ అధ్యక్షత వహించారు. సింగిల్స్ విజేత మహ్మద్ ఫిరోజ్, రన్నర్ అరిఫ్, డబుల్స్ విభాగంలో మార్క్‌జాన్, వినయ్‌లు విజేతులు కాగా సదాయత్ జీద్‌లు రన్నర్స్‌గా నిలిచారు. మహిళల విభాగంలో సింగిల్స్‌లో విశాఖ జైస్వాల్ విజేత కాగా రన్నర్స్‌గా చిన్మయ్ నిలిచారు. డబుల్స్‌లో విజేతలుగా లిపికా, నిషితాలు నిలవగా రియా, కాశీలు రన్నర్స్‌గా నిలిచారు. మహేశ్ ఆనంద్ మాట్లాడుతూ భారతీయ క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిప్పాన్ సంస్థ నిరంతరంగా పని చేస్తోందన్నారు. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, సైక్లింగ్, బ్యాడ్మింటన్‌తోపాటు జల్లికట్టు పోటీలకు ప్రోత్సాహం ఉందన్నారు.



చిన్నారులతో షట్లర్ చిరాగ్ శెట్టి

కేన్సర్‌పై వినూత్న జాగృతి



జాగృతిలో వినూత్నంగా ఇలా..

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): కేన్సర్ మహమ్మారి నుంచి కోలుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించిన వారి అన్వేషణ, అనుభవాలను ఇతరులకు ఆదర్శం కలిగించేలా అపోలో కేన్సర్ సెంటర్ ప్రత్యేక జాగృతి చేపట్టింది. అన్‌మాస్క్ కేన్సర్ పేరిట పరిచయం చేసింది. కేన్సర్ గురించి వాస్తవాలను వెలికితీయడం, అపోహలను దూరం చేయడం, సానుభూతిని పెంపొందించే లక్ష్యంగా పెట్టుకుంది. వరల్డ్ కేన్సర్ డేను పురస్కరించుకుని శనివారం అపోలో కేన్సర్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. అన్ మాస్క్ కేన్సర్ అనేది కేన్సర్ విజేతల ప్రయాణమని ఆసుపత్రి బ్రెస్ట్ అంకాలజీ సీనియర్ కన్సల్టెంట్ జయంతి తుమ్సీ అభిప్రాయపడ్డారు. ఏసీసీ మిషన్ ప్రపంచస్థాయి వైద్య సంరక్షణ అందించడానికి మించినదని వైద్య చరిత్రతో సంబంధం లేకుండా ప్రతి వ్యక్తి హక్కులను సాధించాలని విశ్వసిస్తున్నామన్నారు. అన్‌మాస్క్ కేన్సర్ అనేది కేన్సర్‌తో ఇబ్బందిపడేవారికి మద్దతు, ప్రోత్సాహం, అపోహలు తొలగించే కార్యక్రమమన్నారు. కేన్సర్ నుంచి కోలుకున్న షాహీనా అష్రఫ్ తను అనుభవాలను పంచుకున్నారు.

చింతామణిలో యువకుడి దారుణహత్య

- పోలీసులకు లొంగిపోయిన నిందితుడు



హత్యకు గురైన జాబీర్ పాష (ఫైల్)

చింతామణి, ఫిబ్రవరి 3: వివాహేతర సంబంధం నేపథ్యంలో ఒక యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పట్టణంలోని టిప్పు నగర్‌లో శుక్రవారం రాత్రి సుమారు 11.45 గంటలకు జాబీర్‌పాషా అలియాస్ నేపాళ్ (26) హత్యకు గురయ్యాడు. ఎన్ఎన్‌టీ లేఅవుట్‌కు చెందిన జాబీర్‌పాషా స్థానిక మటన్ దుకాణంలో పనిచేసేవాడని తెలుస్తోంది. పశువుల వ్యాపారి ముక్తియార్‌పాషా భార్యతో జాబీర్‌పాషాకు వివాహేతర సంబంధం ఉన్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే టిప్పునగర్ మెయిన్‌రోడ్డుపై జాబీర్‌పాషాను ముక్తియార్ చాకుతో దాడి చేసి గాయపరిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో మృతి చెందాడు. దాడికి పాల్పడిన అనంతరం ముక్తియార్‌పాషా పట్టణ పోలీసులకు తెలిపి లొంగి పోయాడు. వెంటనే ఘటనా స్థలాన్ని డీఎస్పీ పీ మురళీధర్, పట్టణ సీఐ రంగస్వామయ్య పరిశీలించారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో చిక్కబళ్ళాపుర జిల్లా ఎస్పీ డీఎల్ నాగేశ్, అడిషినల్ ఎస్పీ రాజ ఇమామ్‌ఖాసిమ్‌లు శనివారం మధ్యాహ్నం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్పీ నాగేశ్ మీడియాతో మాట్లాడుతూ స్థానికుల కథనం ప్రకారం వివాహేతర సంబంధమే హత్యకు దారితీసిందని తెలుస్తోందని, మరింత దర్యాప్తు చేస్తున్నామన్నారు. బందోబస్తు కొనసాగిస్తున్నామన్నారు. స్థానికంగా ఈ ఘటన కలకలం చెలరేగింది. కాగా వివాహేతర సంబంధాలు కుటుంబాలలో ఎంతటి చిచ్చు రేపుతున్నాయోనని, ఎలాంటి ఘటనలకు దారి తీస్తున్నాయోనని తెలుస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. ఇకనైనా ఈ ధోరణి వీడి కుటుంబ బంధాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పోలీసులు సూచించారు.



లొంగిపోయిన నిందితుడు ముక్తియార్ పాషా



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ, అడిషినల్ ఎస్పీ

ఖర్గే కూడా బీజేపీలోకి వస్తారేమో..!

- కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి ఎద్దేవా

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బీజేపీకి వచ్చే అనుమానం ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషి ఎద్దేవా చేశారు. హుబ్బళ్ళిలో శనివారం బీజేపీ కార్యవర్గ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడారు. శుక్రవారం మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో 2024లో కూడా వారే అంటూ... మమ్మల్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారన్నారు. దీన్ని చూస్తే ఖర్గే కూడా బీజేపీలో వస్తారేమోననే అనుమానం ఉందన్నారు. ఖర్గే రాజ్యసభలో ప్రస్తావించినప్పుడు అక్కడే ఉన్నానన్నారు. దేశంలో కాంగ్రెస్ పరిస్థితి భయంకరమైందన్నారు. కేంద్రంలో ఎప్పటికీ అధికారంలోకి రామని డిసైడ్ అయ్యారన్నారు. బుద్ధి, జ్ఞానం ఉన్నవారు ఎవరైనా దేశాన్ని విభజిస్తామని వ్యాఖ్యానిస్తారా... అంటూ కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్‌ను ఉద్దేశించి మండిపడ్డారు. దేశాన్ని విభజించేందుకు అదేమైనా వారి తండ్రి ఆస్తినా... అంటూ ప్రశ్నించారు.

శాంతినగర్‌కు సీసీబీ కార్యాలయం

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ క్రైం బ్రాంచ్ (సీసీబీ) ప్రధాన కార్యాలయం మార్పు జరిగింది. చామరాజపేట రాయన్ సర్కిల్‌లోని సీసీబీ కార్యాలయ భవనం శిథిలావస్థదశకు చేరుకుంది. సీసీబీని మార్పు చేయాలనే ప్రస్తావన కొంతకాలంగా ఉండేది. నగర పోలీస్ కమిషనర్ దయానంద్ ఇటీవల కార్యాలయాన్ని సందర్శించిన సందర్భంలో వెంటనే మార్పు చేయాలని రెండు వారాలలోగా ఖాళీ చేయాలని ఆదేశించారు. దీంతో శాంతినగర్‌లోని బీఎంటీసీ భవనంలోకి తాత్కాలికంగా వెళ్లనున్నారు. ప్రస్తుత సీసీబీ కార్యాలయ భవనాన్ని పూర్తిగా తొలగించి అదే ప్రదేశంలోనే నూతన భవనాన్ని నిర్మించదలిచారు. కొన్ని నెలల క్రితమే కొత్త భవనం ప్రస్తావన వచ్చినా కార్యాలయంలో సేవలు కొనసాగుతుండడంతో మార్పు జరగలేదు. ప్రస్తుతం కమిషనర్ తీవ్రస్థాయిలో హెచ్చరించిన మేరకు శాంతినగర్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. కాగా మాజీ మంత్రి, ప్రస్తుత గంగావతి ఎమ్మెల్యే గాలి జనార్ధనరెడ్డిని ఓ కేసులో సీసీబీ అరెస్టు చేసిన వేళ కార్యాలయం అధ్వానంగా ఉందని నా సొంత నిధులతో నిర్మించి ఇస్తానని ఎద్దేవా చేసిన విషయం విదితమే.

దీపకు పీహెచ్‌డీ ప్రదానం



దీప

బెంగళూరు, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): బెంగళూరు శ్రీకృష్ణా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు కె.దీప మైసూరు యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీ సాధించారు. బెంగళూరు ఉన్నత విద్యా విభాగంలో అధ్యాపకులు విధివిధానంపై సమగ్ర పరిశోధన చేశారు. ప్రొఫెసర్ డాక్టర్ బోజన్న నేతృత్వంలో ఉన్నతవిద్యా విధానంపై జరిగిన పరిశోధనలకు పీహెచ్‌డీ దక్కింది. ఈమేరకు శ్రీకృష్ణా గ్రూప్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ రుక్మాంగదనాయుడుతో పాటు కళాశాల తోటి అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు. ఇదే విషయమై దీప మీడియాతో మాట్లాడుతూ బెంగళూరు నగర పరిధిలోని పలు కళాశాలలను సందర్శించి అధ్యాపకుల బోధన తీరుతో పాటు ఉన్నత విద్యావిధానంలో ప్రగతిపై అధ్యయనం చేశానన్నారు. ఎంతోమంది అభిప్రాయాలు తెలుసుకున్నానని సహకరించినవారికి ధన్యవాదాలన్నారు.

అర్థవంతంగా నరేగా దినోత్సవం

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 3: తాలూకా పంచాయతీ సభాంగణంలో శనివారం నరేగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహాత్మా గాంధీ, సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటాలకు పూజలు చేసి కేక్ కట్ చేశారు. ఈఓ, నరేగా సహాయక డైరెక్టర్‌లు నరేగా దినోత్సవం గురించి వివరించారు. ఈ సందర్భంగా నరేగా పథకం కింద తాలూకా, గ్రామపంచాయతీ స్థాయిలో ఉత్తమంగా పనిచేసిన సిబ్బందిని సత్కరించారు. కార్యనిర్వహక అధికారి జీ మునిరాజు, నరేగా సహాయక డైరెక్టర్ చంద్రప్ప, తాలూకాపంచాయతీ మేనేజర్ రమాకాంత్, ప్రసాద్, మంజుళమ్మ, తాలూకా నరేగా టీసీ, టీఎంఐఎస్, టీఐఈసీ, జేఈలు, బీఎఫ్‌టీలు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మార్కెట్‌లోకి ది 4ఎ టేబుల్‌వేర్

బెంగళూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన విలాసవంతమైన టేబుల్‌వేర్ ది 4ఎ ఆన్‌లైన్ ద్వారా మార్కెట్‌లోకి ప్రవేశించింది. వివిధ లోహాలతో పాటు బంగారం, వెండితో తయారు చేసే టేబుల్‌వేర్, గృహోప అలంకరణ వస్తువులు ఉన్నట్లు కంపెనీ కోఫౌండర్ ట్వింకల్ జేవియర్ వెల్లడించారు. ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ 95శాతం టిన్ ఐదుశాతం వెండి, తామ్రం మిశ్రమం వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈయూ ఆహార ఒప్పందం ప్రకారం సురక్షితకు అనుగుణంగా టేబుల్‌వేర్‌లు ప్రత్యేకంగా తయారు చేస్తున్నట్లు పేర్కొన్నారు. విశ్వవ్యాప్తంగా ఆర్థిక సవాళ్ళను ఎదుర్కొంటూనే దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నామన్నారు. ఇప్పటికే పదుల దేశాలలో మార్కెటింగ్ చేస్తున్నామన్నారు. ప్యూటర్స్‌కు సుదీర్ఘ చరిత్ర ఉందని ప్రాచీన ఈజిప్టు మూలాలకు అనుగుణంగా వస్తువులు ఉంటాయన్నారు. 15వశతాబ్దంలో యూరోపియన్‌ల వాడిన వస్తువుల తరహాలో ఎన్నో కళాఖండాలు మార్కెట్‌లోకి తీసుకువస్తున్నామన్నారు. ప్యూటర్ వస్తువుల చేతిలో పట్టుకోవడం ద్వారా చరిత్రను సృష్టించినట్లుగా ఉంటుందన్నారు. దేశంలో శ్రీమంతులకు కొదవలేదని 2026 నాటికి మార్కెట్‌లో విస్తృతం చేస్తామని 2030నాటికి 105శాతం మార్కెటింగ్ పెంచదలచామన్నారు.

రోడ్ల విస్తరణకు శ్రీకారం



రోడ్ల విస్తరణ పనుల ప్రారంభంలో ఎమ్మెల్యే మంజుళా లింబావళి తదితరులు

మహదేవపుర, ఫిబ్రవరి 3: నియోజకవర్గంలోని వర్తూరులో రహదారుల విస్తరణకు ఎమ్మెల్యే మంజుళా అరవింద లింబావళి నేతృత్వంలో శనివారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈరోడ్డు అభివృద్ధికి బీజేపీ హయాంలో లింబావళి గ్రాంట్లు సాధించారని, ప్రస్తుతం పనులు చేపట్టారన్నారు. కేఆర్‌డీసీఎల్ శాఖ అధికారులు, బీబీఎంపీ రోడ్డు విభాగం అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తదితరులు సహకారంతో రోడ్డుకు అనుబంధమైన ప్రైవేట్ ఆస్తులను తొలగించే పనులు చేపట్టారన్నారు. ప్రజల సంచారం కోసం ఈ పనులు ఎంతో కీలకమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ బీజేపీ హోబళి అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, ప్రముఖులు రాజేశ్, వర్తూరు శ్రీధర్, చిక్కణ్ణ, వెంకటేశ్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పుష్పా మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.